క్లుప్తంగా

పేదలకు అన్నదానం

సంతనూతలపాడు: సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 31వ వారం పేదలకు దాతల సహకారంతో అన్నదానం చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ట్రస్ట్ ఫౌండర్ సంపత్ చేస్తున్న సేవలను పలువురు అభినందించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ముమ్ముందు హితోధిక సేవలు అందించనున్నట్లు సంపత్ వెల్లడించారు. అందుకు కృషి చేస్తున్న ట్రస్టు ప్రతినిధులను ఈ సందర్భంగా సంపత్ సత్కరించారు. సంపత్‌ను ట్రస్ట్ ప్రతినిధులు సత్కరించారు. ఎన్నారై వేజెండ్ల పర్ణిక జన్మదినం సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శనగల వెంకటరమణ, వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, సెక్రటరీ చివుకుల సుబ్బయ్య, జాయింట్ సెక్రటరీ కంకణంపాటి వెంకటేశ్వర్లు, ట్రస్ట్ గౌరవాధ్యక్షురాలు షేక్ హసీనా బేగం, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

మనువాద వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం


చీమకుర్తిలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కేఎన్‌పీఎస్ నాయకులు

చీమకుర్తి: దళిత, బడుగు, బలహీనవర్గాల ప్రజల హక్కులను అణగదొక్కబడే మనువాద వ్యతిరేక విధానాలను తిప్పికొడదామని కేఎన్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మనుస్మృతి ధర్మాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం చీమకుర్తిలోని పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 1927 డిసెంబర్ 25న దళితులకు వ్యతిరేకంగా ఉన్న మనుస్మృతిని వ్యతిరేకిస్తూ వేలాది మంది ప్రజల సమక్షంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనుస్మృతిని దహనం చేసిన రోజును పరస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తొలుత మనుస్మృతి ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కేఎన్‌పీఎస్ మండల అధ్యక్షుడు ఆరె తోటి రాంబాబు, గంటెనపల్లి పోతురాజు, పిన్నిక శ్రీనివాసరావు, వేమా యలమంద, పొత్తూరి శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు వెంకటేశ్వర్లు

సంతనూతలపాడు: పార్లమెంటులో అంబేడ్కర్‌ని అవమానపరచడం అంటే రాజ్యాంగాన్ని అవమానపరిచినట్లేనని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని మంగమూరులో అంబేడ్కర్ విగ్రహం ఎదుట బుధవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంబేడ్కర్‌ని అవమానపరచడం అంటే బీజేపీ నిజస్వరూపం ఏమిటో బయటపడిందన్నారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి మనుధర్మ శాస్త్రాన్ని చాతుర్వర్ణ వ్యవస్థను ముందుకు తీసుకొస్తున్నారని అన్నారు. రాజ్యాంగం ద్వారా పదవులు అనుభవిస్తూ ఆ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయాలనుకోవడం ద్వారా దేశంలో ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, దేశ సమైక్యత ప్రమాదంలో పడబోతున్నాయని అన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్ఎస్ మనువాద భావజాలానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యవాదులు ముందుకు రావాలని, అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కె.అజయ్, చెన్నకేశవులు, డి.శ్రీను, కె.రాజు, తిప్పాబత్తిన రాము, అబ్బూరి వెంకటేశ్వర్లు, ఎస్.కె.మస్తాన్, కె.నాగేశ్వరరావు, కె.శివ, మంచికలపాటి శ్రీను, కె.రాజేష్, డి.ధనుంజయ, కట్టా ప్రసాద్, డి.వెంకటేశ్వర్లు, పోతురాజు, కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొని వ్యక్తికి గాయాలు


తీవ్రంగా గాయపడిన సుబ్బారావు

నాగులుప్పలపాడు: అతివేగంగా వచ్చి లారీని బలంగా ఢీకొట్టిన వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. 108 సిబ్బంది, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. చదలవాడ గ్రామానికి చెందిన రావూరి సుబ్బారావు నాగులుప్పలపాడు సమీపంలోని కోకిల కోల్డ్ స్టోరేజ్ వద్ద నుంచి 216వ నంబర్ జాతీయ రహదారి ఎక్కే క్రమంలో ఇంకొల్లు వైపు వెళ్తున్న లారీని మధ్యలో వేగంగా ఢీకొట్టాడు. దీంతో సుబ్బారావుకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో ఒంగోలు ఆస్పత్రికి తరలించారు.



ఒంగోలు పునీత చినథెరేసమ్మ చర్చిలో దైవప్రసంగం చేస్తున్న ఫాదర్ డీఎస్ పాల్, హాజరైన క్రైస్తవులు


ఒంగోలు జేఎంబీ చర్చిలో దైవప్రసంగం చేస్తున్న పాస్టర్ జాన్‌కెనడి


నాగులుప్పలపాడు : క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న పాస్టర్ వెంకటేశ్వరరావు

లోక రక్షకుడు.. ఏసుక్రీస్తు


సంతనూతలపాడు ఇండియా పెంతెకోస్త్ చర్చిలో సందేశమిస్తున్న పాస్టర్


కొత్తపట్నం: చర్చిలో కొవ్వొత్తులతో ప్రార్థనలు చేస్తున్న మహిళలు


కె.పల్లెపాలెంలో ది లివింగ్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ ప్రార్థన మందిరంలో ప్రార్థనలు చేస్తున్న జాషువ, క్రైస్తవులు

- భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు
- క్రైస్తవులతో కిటకిటలాడిన చర్చిలు

సంతనూతలపాడు: ప్రభువు ఏసుక్రీస్తు లోక రక్షకుడని, పాపులను రక్షించేందుకు ఆయన ఈ లోకానికి వచ్చారని పలువురు పాస్టర్లు సందేశమిచ్చారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని సంతనూతలపాడులోని అంబేడ్కర్ నగర్ మొదటి లైన్ ఇండియా పెంతెకోస్త్ దేవుని సన్నిధానం చర్చిలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. వందలాదిగా క్రైస్తవులు తరలివచ్చి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ బి.జనార్దన్ దైవసందేశం అందించారు. క్రిస్టియన్‌పాలెంలో గల సిలోయం బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ నిక్సన్ సందేశమిస్తూ దేవుడు లోకానికి వెలుగై వచ్చారని తెలిపారు. చీకటిలో ఉన్న మానవుడిని వెలిగించేందుకు తాను త్యాగానికి సిద్ధపడ్డారని చెప్పారు. సంతనూతలపాడు మండలంలోని అన్ని చర్చిల్లో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భారీగా తరలివచ్చిన భక్తులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. క్రిస్మస్ సందర్భంగా దివ్య బలి పూజలు సమర్పించారు. అనంతరం బాల ఏసు ప్రతిమను భక్తులు ముద్దాడి తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. ఎస్‌ఎస్పీ కాలనీలో గల మిస్పా ప్రార్థనా మందిరం పాస్టర్ తేళ్ల విల్సన్ చర్చిలో క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు. కిక్కిరిసిన భక్తులతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రజకపాలెంలోని సియోను ప్రార్థనా మందిరం పాస్టర్ రవికుమార్, శ్వేతా గ్రేస్ క్రిస్మస్ పండుగ విశిష్టత, ఏసు ప్రభువు పుట్టుక గురించి వివరించారు. జీవితంలో నూతనోత్తేజాన్ని కలిగించిన దేవుడు సమస్త ఆనందాలను పంచారని తెలిపారు. ఆ ప్రభువు చూపిన దారిలో మనమంతా నడుద్దామన్నారు. మెయిన్ రోడ్డు వద్ద గల బ్లెస్సింగ్ ఏజీ చర్చిలో పాస్టర్ రోజ్‌మేరీ క్రిస్మస్ పండుగను ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు. అంబేడ్కర్ నగర్ 4వ లైన్‌లో ఆది అపొస్తుల చర్చిలో పాస్టర్ జాషువా క్రిస్మస్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంతనూతలపాడు మండలంలోని చర్చిలు, వీధులు విద్యుత్ దీపాలతో కళకళలాడాయి. నక్షత్రాలు నేలకు దిగి వచ్చినట్లు వెలుగులు విరజిమ్మాయి. నక్షత్రాలు, ట్రీలను అలంకరించారు. స్టార్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పండుగను పురస్కరించుకుని బంధుమిత్రులకు క్రైస్తవులు పిండివంటలు, మిఠాయిలు పంచిపెట్టారు. నూతన వస్త్రాలు ధరించి సంతోషంగా గడిపారు. చిన్నారులకు బహుమతులు అందజేసి పెద్దలు ఆశీర్వదించారు. ఎటు చూసినా పండుగ వాతావరణం కనిపించింది. క్రైస్తవులకు కులమతాలకు అతీతంగా పలువురు శుభాకాంక్షలు చెప్పడం కనిపించింది.

మానవాళికి ప్రేమ మార్గం చూపిన ఏసుక్రీస్తు...

సంతనూతలపాడు: ఏసుక్రీస్తు మానవజాతికి ప్రేమ మార్గాన్ని చూపడానికే అవతరించారని, ఆయన జీవితం ప్రపంచశాంతికి ఒక సందేశమని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ అన్నారు. సంతనూతలపాడు మండలం గుమ్మలంపాడు గ్రామంలోని అంబేడ్కర్‌నగర్‌లో జీసస్ క్రైస్తవ చర్చిలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దుంపా రమణమ్మ పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. పెద్ద ఎత్తున హాజరైన క్రైస్తవులు, విశ్వాసులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ఆచరించటమే నిజమైన క్రిస్మస్ అని చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి మాట్లాడుతూ లోక రక్షకుడు ప్రజలను పాపాల నుంచి రక్షించేందుకే జన్మించాడన్నారు. సత్యం, ధర్మం, శాంతి, సహనాలను ఏసుక్రీస్తు ప్రపంచానికి అందించారన్నారు. పాస్టర్ జాన్‌బాబు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని సొసైటీ మాజీ అధ్యక్షుడు బొక్కిసం శివరామయ్య కుమార్తె, ఎన్నారై కే లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు దుంపా యలమందారెడ్డి, బి.శివరామయ్య, పాస్టర్ జాన్‌బాబు, సర్పంచ్ షేక్ పాత్యసాహెబ్, మాజీ సర్పంచ్ బి.రమాదేవి, గ్రామ నాయకులు జె.శ్రీనివాసరావు, తిరుపతిస్వామి, సంకే విజయ్‌కుమార్, సీహెచ్ చేజర్లయ్య, బొడ్డపాటి శ్రీనివాసరావు, సంఘస్తులు పాల్గొన్నారు.

క్రిస్మస్ సందర్భంగా సేవా కార్యక్రమాలు...

చీమకుర్తి: క్రిస్మస్ పర్వదినాన్ని చీమకుర్తిలో బుధవారం పలు సేవా కార్యక్రమాలతో దాతలు, భక్తులు, అభిమానులు ఉత్సాహంగా జరుపుకున్నారు. క్రిస్మస్‌తో పాటు చీమకుర్తి కంటి డాక్టర్‌గా పేరుగాంచిన డాక్టర్ ఎంవీఎల్ నరసింహారావు జయంతిని పురస్కరించుకొని లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీ జవహర్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, పంపిణీ చేశారు. పేద మహిళలకు కుట్టు మిషన్‌లు, ప్లాట్‌ఫాంలపై కులవృత్తులు చేసుకునే వారికి లయన్స్‌క్లబ్‌చే రూపొందించిన గొడుగులు అందించారు. ప్రభుత్వ పాఠశాలలకు టీచింగ్ గ్రాంట్‌ల కింద ప్రతి నెలా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. తొలుత డాక్టర్ ఎంవీఎల్ నరసింహారావు జయంతిని పురస్కరించుకుని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆనుకుని ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి, గ్రానైట్ యజమానులు చలువాది బదరీనారాయణ, నూనె సుబ్రహ్మణ్యం, హేమసుందరం, లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ విజయకుమార్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, చీరల పంపిణీ...

ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి ఆర్థిక సాయంతో చీమకుర్తి క్రిస్టియన్‌పాలెంలోని పేదలకు క్రిస్మస్ సందర్భంగా బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చిలో కేకు కట్ చేశారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, వైఎస్ భారతి సేవా సమితి అధ్యక్షురాలు పాటిబండ్ల రాజసులోచన, మాజీ కౌన్సిలర్ శారద ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

నాగులుప్పలపాడు మండలంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

నాగులుప్పలపాడు: క్రీస్తు పుట్టుకే సర్వమానవాళికి విమోచన దినమని నాగులుప్పలపాడు మండలంలోని ఒమ్మెవరం ఏబీఎం చర్చ్ పాస్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉప్పుగుండూరులో క్రిస్టియన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం ఆకట్టుకుంది. జయంతిపేటలో క్రీస్తుసంఘం చర్చిలో క్రిస్మస్ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు బాలికలకు దుస్తులు అందించారు. వాటిని పాస్టర్ నరేష్ ఆధ్వర్యంలో చిన్నారులకు అందజేశారు. నాగులుప్పలపాడు కవనెంట్ చర్చిలో పాస్టర్ సౌభాగ్యరావు ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ అంజలి ప్రత్యేక ఆత్మీయ ప్రసంగం చేశారు.

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: మండలంలోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. క్రీస్తు వాఖ్యాలు, కీర్తనలు ఆలపించారు. క్రీస్తు మార్గంలో అందరూ నడవాలని పాస్టర్లు బోధించారు. ప్రార్థనా మందిరాల్లో కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. రెండు రోజులు ముందు నుంచే క్రిస్మస్ వేడుకలకు మండలంలోని ప్రార్థనా మందిరాలు ముస్తాబయ్యాయి. ప్రభువైన ఏసుక్రీస్తు జననం లోకరక్షణకే అని చాటిచెప్పేలా చర్చిలు, క్రైస్తవుల నివాసాల వద్ద అలంకరణలో చేశారు. పలు యూత్ సొసైటీల ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా భారీ క్రిస్మస్ స్టార్లు ఏర్పాటు చేశారు. క్రైస్తవ విశ్వాసులు నివాసం ఉంటున్న ప్రాంతాలు, చర్చిలు, విద్యుత్ దీపాల అలంకరణలో జనాన్ని ఆకట్టుకున్నాయి. ప్రార్థన మందిరాలను రంగురంగుల పేపర్లతో అలంకరించారు. క్రిస్మస్ కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కె.పల్లెపాలెం గ్రామంలో ది లివింగ్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ ప్రార్థన మందిరంలో పాస్టర్ జాషువా క్రీస్తు జననం గురించి, పరిశుద్ధ గ్రంథములో రాయబడిన మాటలను వివరించారు. సంఘ సభ్యులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

చీమలమర్రి గ్రామంలో...

చీమకుర్తి రూరల్: మండలంలోని చీమలమర్రి గ్రామంలో తెలుగు బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘ కాపరి గద్దల దేవసహాయం దైవ సందేశం అందించారు. సత్యం, శాంతి, త్యాగం, ప్రేమ, కరుణ, దయతో ఏసుక్రీస్తు ఈ లోకానికి సరికొత్త మార్గం చూపారని తెలిపారు. లోక రక్షకుడిగా కీర్తించే క్రీస్తు జననం ప్రపంచానికి పర్వదినమని తెలిపారు. విశ్వాసులు క్రీస్తు పుట్టుక సందర్భంగా కీర్తనలు ఆలపించారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సంఘ పెద్దలు జడ సుగణరావు, జడ వీరయ్య, జడ డేవిడ్, మాగులూరి జయేంద్రరావు, సంఘస్తులు, విశ్వాసులు, యవనస్తులు పాల్గొన్నారు. మంచికలపాడు గ్రామంలో ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సంఘ కాపరి మాగులూరు పురుషోత్తం దైవ సందేశం అందించారు.

మద్దిపాడు మండలంలో...

మద్దిపాడు: పరులయందు దయ కలిగి ఉండాలని, వారికి చేతనైన సహాయం చేయాలని పాస్టర్ అబ్రహం పిలుపునిచ్చారు. క్రిస్మస్ సందర్భంగా మండలంలోని పలు చర్చిలలో క్రీస్తు జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రీస్తు ఆగమనం గురించి పాస్టర్లు వివరించారు. క్రీస్తు సందేశం వినిపిస్తూ పరుల యందు దయ కలిగి ఉండాలని తెలిపారు. ఏసుక్రీస్తు బోధన సారాంశాన్ని వివరించారు. ఉదయం నుంచి క్రైస్తవులు చర్చిల వద్దకు చేరి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పలు చర్చిల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


చీమకుర్తి : కేకు కట్ చేస్తున్న మారం వెంకారెడ్డి


ఒంగోలు పునీత చినథెరేసమ్మ చర్చిలో వెలుగుతున్న దీపంలో క్రీస్తు జననం సెట్టింగ్


నాగులుప్పలపాడు : చర్చిలో పిల్లలకు నూతన వస్త్రాలు అందజేస్తున్న పాస్టర్


మద్దిపాడు చర్చిలో దేవుని వాక్యం వినిపిస్తున్న పాస్టర్ అబ్రహం

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న భారతి సిమెంట్స్ ప్రతినిధులు...

ఒంగోలు టౌన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన వేడుకల్లో భారతి సిమెంట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. పమిడిపాడు ఫ్రీచ్ చర్చి, ఒంగోలులోని బాప్టిస్ట్ చర్చిలలో భారతి సిమెంట్స్ డిప్యూటీ మేనేజర్ ఎస్వీ సుబ్బారెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ వి.సాంబశివరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేక్ కట్ చేసి భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఒంగోలు డీలర్లు మహాలక్ష్మి స్టీల్ ట్రేడర్స్ యజమాని ఎంఆర్ భాస్కర్‌రెడ్డి, శివసాయి ఏజెన్సీస్ యజమాని వెంకటరావు పాల్గొన్నారు.


క్రిస్మస్ వేడుకల్లో భారతి సిమెంట్స్ ప్రతినిధులు


చీమకుర్తి : పేదలకు దుప్పట్లు అందిస్తున్న మారం వెంకారెడ్డి, చలువాది బదరీనారాయణ


సంతనూతలపాడులో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, నాయకులు



ఒంగోలు జేఎంబీ చర్చిలో క్రిస్మస్ గీతాలు ఆలపిస్తున్న క్వాయర్ బృందాలు


చీమకుర్తి : పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, వైఎస్ భారతి సేవా సమితి అధ్యక్షురాలు రాజసులోచన


చీమలమర్రిలో క్రిస్మస్ సందర్భంగా నృత్యాలతో అలరిస్తున్న చిన్నారులు


సంతనూతలపాడు సియోను చర్చిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న పాస్టర్ శ్వేతాగ్రేస్


కూనంనేనివారిపాలెంలో విద్యుత్ దీపాల అలంకరణలో చర్చి

రేపు వైఎస్సార్ సీపీ పోరుబాట

- విజయవంతం చేయాలని పార్టీ నాయకుల పిలుపు

సంతనూతలపాడు:

పెంచిన విద్యుత్ చార్జీలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ నిర్వహించనున్న పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి పిలుపునిచ్చారు. పోరుబాట వాల్‌పోస్టర్లను బుధవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికల సమయంలో కరెంటు చార్జీలు తగ్గిస్తానంటూ బూటకపు హామీలు గుప్పించి చంద్రబాబు గద్దెనెక్కాడని, ప్రస్తుతం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను మోసం చేశాడని మండిపడ్డారు. చంద్రబాబు అబద్ధాలు, మోసాలు మళ్లీ ఒకసారి రుజువవుతున్నాయని, వాటిని ప్రజలు గమనించాలని కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో సంతనూతలపాడులోని చర్చి సెంటర్లో ఉన్న వైఎస్సార్ విగ్రహం నుంచి ఎస్ఈ కార్యాలయం వరకు 27వ తేదీ ర్యాలీగా వెళ్లి నిరసన తెలుపుతామన్నారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉంటే ఒకటి చెప్తాడు.. ప్రభుత్వంలో ఉంటే మరొకటి చేస్తాడంటూ విమర్శించారు. ఇప్పటికే జీఎస్టీలతో ధరల మోతమోగి ప్రజలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మన డబ్బుతో పన్నులు వసూలు చేసి సంపద సృష్టిస్తానని చంద్రబాబు చెప్పడం ఎంతవరకు సమంజసమో ప్రజలే అర్థం చేసుకోవాలన్నారు. జనం చంద్రబాబుకు ఓట్లు వేస్తారని, తర్వాత ఆయన వాతలు పెడతాడని, ప్రజలు మళ్లీ పొరపాటుపడ్డామనుకుని గద్దెదించడం ఆనవాయితీగా మారిపోయిందని అన్నారు. ప్రజల తరఫున పోరాటం చేసేందుకు వైఎస్ జగన్ పోరుబాటకు పిలుపునిచ్చారన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెనక్కు తీసుకోవాలని ఈ నెల 27వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించి విద్యుత్ శాఖాధికారులకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కరెంటు చార్జీలు తగ్గించేంత వరకు పోరాటం ఉధృతం చేస్తామన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలంతా పోరుబాటలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు దమ్మాల శ్రీను, సొసైటీ మాజీ చైర్మన్ దుంపా యలమందరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ రహమతుల్లా, కుంచాల నాగాంజనేయులు, తన్నీరు మోహనరావు, పల్లెపు శ్రీను, సుబ్బారావు, కొత్తపల్లి వెంకటసుబ్బయ్య, నల్లగట్ల రామాంజనేయులు, కుంచాల నాగరాజు, రహీం, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.


పోరుబాట వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చెంచిరెడ్డి, యలమందారెడ్డి, నాయకులు

పోరుబాటను విజయవంతం చేయాలి...

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 27న సంతనూతలపాడులో నిర్వహించనున్న వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మండల రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు ఆ పార్టీ శ్రేణులకు బుధవారం పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే విద్యుత్ చార్జీల భారం పెంచినందుకు నిరసనగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.